


# చికాగో నుండి చింతమడక

**అ**మెరికాల విమానమెక్కి చీకటింట్ల పిల్లిపిల్ల లెక్క కూచున్న. ఆకాశ యానముల సముద్రాలు దాటొచ్చి హైదరాబాదుల దిగుతున్న. మాతృభూమి కనబడంగానే నరాలల్ల ఉల్లాసం ఉరుకులాడింది. టాక్సీల ఇంటికి పొయ్యి నానమ్మ, అమ్మానాన్నల పాదాల దగ్గర పరవశించి ఆశీస్సులందుకున్న. "హాయ్ అన్నయ్యా!" తోడబుట్టి, కూడి పెరిగిన తమ్ముడు నాగరాజు, చెల్లెలు కృష్ణలు లేడిపిల్లలోలె ఉరికొచ్చి చెరో చెయ్యి అందుకుని పెదాల కానిచ్చుకున్నరు. ఆనందోద్వేగాన్ని ఆపుకోలేక ఇద్దరిని అక్కున చేర్చుకున్న. నాన్న కళ్లల్ల ఆనంద బాష్పాలు మెరుస్తున్నె. "అన్నయ్య ఒంటరిగా వచ్చిండు, జంటగా తిరిగిపోతడు గద నాన్నా!" చెల్లెలు సరిగమలు. మా ఇంట్ల అందరికంటే చిన్నది కృష్ణవేణి.... డిగ్రీ స్టూడెంటు. తమ్ముడు నాగరాజు పీ.జీ. స్టూడెంటు. "నలుగురైదుగురు బ్రోకర్లు నలభైదాకా సంబంధాలు తెచ్చింద్రురా. ఎవరిని సెలక్టు చేసుకున్నా మా కభ్యంతరం లేదు." నాన్న ప్రతిపాదించాడు.

"ఈ సారి పెండ్లి ఖాయం బిడ్డా!" అమ్మ గరం ఛాయలు తెచ్చింది. అయితే, ప్లాను ప్రకారమే రమ్మన్నరన్నమాట. మూడేండ్ల తర్వాత అమ్మ అమృత హస్తాల వంట... రుచుల పంట. ముచ్చట్ల తోటల షికారు చేసుకుంట కలిసి బువ్వ తిన్నం. "అన్నయ్య అలసి పోయిండు. రెస్టు తీసుకోనివ్వుంద్రి" ఆదేశించి నాన్న బయటికి వెళ్ళిపోయిండు. మధ్యాహ్నం ఎండ మండిపోతోంది. మంచమ్మీద ఒరగంగనే నిద్రాదేవి కౌగిట్ల చేర్చుకుంది. ఓ గంటసేపు గాఢ నిద్ర. తెలివికి రాంగనే నెత్తిమీద నుంచి కొన్ని క్వింటాళ్ల బరువు దిగిపోయినట్టుంది. ఓసారి చింతమడక గ్రామానికి పొయ్యి రావాలే. చికాగో నుంచి మంజీర వాళ్ల చుట్టాలకు పంపించిన బహుమతుల్ని అప్పజెప్పి రావాలే. మనసు తెరమీద మంజీర ప్రత్యక్షమైంది.

ఆలోచనాలోచనాలు  గతం పుస్తకం పేజీలల్ల చొరబడ్డాయి. "జీవితంలో పైకి రావాలని కలలు కనుండ్రి. కన్న కలల్ని సాకారం చేసుకునేందుకు మస్తుగ శ్రమించుండ్రి." ఆనాటి రాష్ట్రపతి, మేధావి అబ్దుల్‌కలాం యువతకిచ్చిన సందేశం ఉత్తేజాన్నిచ్చింది. పట్టుదల పెట్టుబడిగా ఇంజనీరింగ్ పీ.జీ.ల చేరిన. ఫైనల్ల ఉన్నప్పుడే పేరున్న అంతర్జాతీయ కంపెనీ క్యాంపస్ సెలక్షన్ల ఎంపిక చేసుకుంది.

"పల్లెటూర్ల పుట్టి, పట్నంల పెరిగి, మెగా సిటీల సెటిలైన నీకు ఇదో వరమురా వేణూ!" నాన్న ఆనందం అంతా ఇంతా కాదు. అమ్మ ఆప్యాయంగా గుండెలకు హత్తుకుంది. "నా బంగారుకొండా! తమ్ముడు, చెల్లెలు నిన్ను చూసి నేర్చుకుంటరురా" నుదురు ముద్దాడింది. జీవన సాఫల్యమనే ధ్యేయం కళ్లల్ల కదుల్తాంటే దాన్ని సాకారం చేసుకోవాలనే తపన గుండెలల్ల ఎగిరి పడింది. అందరి ఆకాంక్షల కనుగుణంగా పీ.జీ.ల ర్యాంకొచ్చింది. యువరక్తం ప్రగతి పథం వైపు దృష్టి సారించింది. అగ్రరాజ్యం అమెరికాల ఉద్యోగం, చికాగో నగరంల నివాసం. ఆనాడు భారతఖ్యాతి వివేకానందుడు సనాతన ధర్మ దుందుభులు మోగించిన పవిత్ర ప్రదేశం....మనో సాగరం ఉత్తుంగ తరంగాలమయమైంది. "చిన్నప్పటి నా దోస్త్ మనూరి రంగారావు అక్కడనే  ఉంటున్నడురా. నేను ఫోన్‌ల చెప్తా. సక్కగ వొయ్యి వాళ్లింట్లనే దిగు" నాన్న అన్నడు. వెంటనే సెల్‌ఫోన్‌ల మాట్లాడిండు రంగారావుతోని.

విమాన ప్రయాణం... ఆశయాల పిడికిట్ల ఆశల ఆరాటం ఉక్కిరి బిక్కిరి చేసింది. చికాగోల దిగంగనే... రంగారావు స్వయంగా వచ్చి స్వాగతం పలికిండు. ప్రపంచ దేశాల జుట్లుపట్టి ఆడిస్తున్న అగ్రరాజ్యం అద్భుతాలను చూసుకుంట వాళ్ల అపార్టుమెంటుకు కారుల చేరుకున్నం. ఇంట్ల అడుగు పెట్టంగానే "వెల్‌కమ్ వేణుగోపాల్ జీ" ఓ యువతి మెరుపు తీగలెక్క ఎదురొచ్చింది. సామన ఛాయ శరీరం, గులాబిరంగు పరికిణీ, మ్యాచింగ్ వోణి, విశాల నేత్రాలు, వాలుజడలో పూలదండ, వయసుకు తగిన వంపుసొంపులు... నూటికి నూరు పాళ్ల తెలంగాణమ్మాయే. "అంకుల్! ఈ అమ్మాయి...?" ఆశ్చర్యంతో అడిగిన. ఆమె పెదాల మీదో చిరునవ్వు ఇట్లా మెరిసి అట్లా మాయమైంది.

"ఈమె నా ఏకైక సంతానం. పేరు మంజీర. మన మెదకు జిల్లా జీవనది మంజీరను గుర్తు చేసుకుని ఆ పేరు పెట్టినం. మంజీర పుట్టిన మూడు నెలల లోపల నాకీ దేశంల వ్యాపారానికి అవకాశమొచ్చింది. ఫ్యామిలీతో వచ్చి సెటిలైన" మురిసిపోయిండు. నమస్కార, ప్రతి నమస్కారాలైనాయి. ఆయననే తన కారులో తోలుకుపొయ్యి కంపెనీ ఉద్యోగంల

జాయిన్ చేయించింది. వాళ్ల మధ్య స్వేచ్ఛగా మెదలలేక ఇబ్బందిగా ఫీలైపోయిన వారం రోజుల్ల పక్క పోర్షన్ ఖాళీ అయింది. వెంటనే నా నివాసం అందులోకి మారింది. రంగారావు రాష్ట్ర పరిస్థితుల గురించి, ఉద్యమం గురించి, ఉద్యమనేత కె.సి.ఆర్ గురించి మరీ మరీ అడిగి తెలుసుకున్నడు. రోజూ ఆఫీసులో అలసిపోయి ఇంటికి రాంగనే మంజీర చిరునవ్వుతో పలకరించడం ప్రాణవాయువు లెక్క పంజేసింది. ముచ్చట్లు, అచ్చట్లతోని కాలక్షేపం. మా సొంతూరు చింతమడ్క ప్రకృతి పులకింతలు, పచ్చని పొలాల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకునేది. రంగారావైతే తన బాల్య స్నేహితుడైన ఉద్యమనేత కె.సి.ఆర్‌తో, మా నాన్నతో కలిసి చింతమడకల దంగు చింతచెట్టు కింద, ఎత్తుమీది తోట్ల, మక్క చేనుల ఆడుకున్న ఆటల గురించి ఎన్నో విషయాలు చెప్తాంటే పుల్లారెడ్డి మిఠాయిలు తింటున్నట్లనిపించేది.

మంజీర సన్నని పెదాలతో ఎంతసేపు మాట్లాడినా వినాలన్పించేది. "మా నానమ్మ, పిన్ని - బాబాయి, వాళ్ల పిల్లలిప్పటికీ చింతమడ్కలనే వున్నరు. నేను రెండుసార్లు పొయ్యొచ్చిన. మా నాన్న చిన్నప్పుడు ఆడుకున్న దంగుచింత, ఎత్తుమీది తోట, పచ్చని పొలాలు చూస్తుంటే అక్కడనే ఉండి పోవాలన్పించింది." మంజీర వోణి సవరించుకుంటూ గర్వంగా చెప్తుంటే మూడు రాళ్ళ ముక్కుపుడక త్రివర్ణ పతాకమోలె మెరిసేది. అంతా కలిసి ఆమె ఓ అందాల దేవతోలె మనసు పొరలల్ల నిలిచిపోయింది. అమెరికాల ఉన్న యువత విచ్చలవిడితనం, డేటింగులు మంజీరకు నచ్చవని వాళ్ళమ్మ చెప్తుంటే ఆశ్చర్యపడే వాణ్ణి. 'మా మంజీరను పూర్తిగా భారతీయ పద్ధతులల్ల పెంచుతున్నం' అన్నదో సారి. మరోసారి రంగారావు శూన్యంలోకి చూసుకుంట "చింతమడకల నా బాల్యం బ్రహ్మాండంగా గడిచింది వేణూ! మీ నాన్న, నేను, కె.సి.ఆర్ కలిసి సిద్దిపేటల చదువుకున్నం. సెలవులల్ల చింతమడకలుండే వాళ్లం. ఎండాకాలం గచ్చుబాయిల ఈదులాడుతుండే వాళ్లం" పరవశంగా చెప్తుంటే ముఖం సింగిడి లెక్క వెలిగిపోయేది. మంజీరలోని ముచ్చట్లల్ల భారత-అమెరికాల విద్యా విధానం, సినిమాలు, టీవీ ప్రోగ్రాంలు, పురాణ కథలు దొర్లిపోతుండేవి. అప్పుడప్పుడు వాళ్లమ్మానాన్నలు గూడా చర్చలల్ల భాగస్తులయ్యేవారు. తన గది మంజీరతోని మాట ముచ్చట సుదీర్ఘంగా సాగేది. ప్రత్యేకించి ఆదివారం నాటి మాట ముచ్చట్లల్ల పాత తెలుగు సినిమాలు, హిందీ సినిమాల ప్రస్తావన వచ్చేది. 'శంకరాభరణం', 'స్వాతిముత్యం', 'మొగల్ ఎ ఆజూమ్', 'హమ్‌రాహీ', 'నీల్‌కమల్', లాంటి సినిమాల సీ.డీ.లు వేసుకొని చూస్తుంటే పొద్దెట్లా గడిచిందో తెలిసేదికాదు. మనసారా నవ్వుకుని తృప్తిగా ఊపిరి పీల్చుకునే వాళ్లం.

ఓసారి పెళ్లిళ్ల విషయం ప్రస్తావన కొచ్చింది. భిన్నత్వంలో ఏకత్వం సాధించిన భారతీయ దాపత్యం గురించి చాలా సేపు మాట్లాడుకున్నం. ప్రేమ విషయం మాటల్లో దొర్లింది. నేను గానీ, ఆమె గానీ ప్రేమసాగరంలో మునగలేదని అనుకున్నము. నవ్వుతుంటే ఆమె నున్నని బుగ్గల సొట్టలు అపురూపంగా కనబడేవి. ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధించాలన్పించేది. సోఫా వెనక్కొరిగి కూచుండి పొడగాటి నల్లని జడను చేత్తో తిప్పుతుంటే ఆ జడను అందుకోవాలని మనసు తహతహలాడేది. జోకులు పేలినప్పుడు కిలకిలా నవ్వుతుంటే నవరత్నాలు కుమ్మరించిన సవ్వడి వినబడేది. మంజీర పక్కన కూచుని అమ్మా నాన్నా చెల్లెలుతో

ఇంటర్నెట్‌లో మాట్లాడేవాణ్ణి. ఆమె కూడా చింతమడకలో ఉన్న వాళ్ల బాబాయి, నానమ్మలతో మాట్లాడుతూ గర్వంగా ఫీలయేది. ఓ రోజు మంజీరతో కలిసి స్వామి వివేకానంద సింహగర్జన చేసిన చోటికి వెళ్లినాం. అక్కడున్నంత సేపు మానస సరోవరంల ఆనందహంసలు వయ్యారా లొలుకబోసినై. నా చేతిలో చెయ్యేసి 'వివేకానంద, మహాత్మాగాంధి, విప్లవ వీరసావర్కర్, స్వామి చిన్నయానంద లాంటి బిడ్డల్ని కన్నందున భారతమాత అదృష్టవంతురాలు గదా' అన్నది. కలిసిన చేతులు ఎప్పుడూ అట్లనే ఉంటే ఎంతో బాగుండన్పించింది.

ఒకసారి మాటల సందర్భంగా వాళ్లమ్మ "మంజీరకు పెళ్లి చెయ్యాలను కుంటున్నాం. మంచి సంబంధం చూడాలి" అంది. మంజీర ఓసారి 'నేను పీ.జి. దాకా చదివినా అబ్బాయిలతో స్వేచ్ఛగా తిరగడం నాకెందుకో నచ్చలేదు. అమ్మానాన్నలు గూడా అంటుకాస్కార మివ్వలేదు' అన్న సంగతి గుర్తొచ్చింది. వెంటనే నేను "నాకూ పెళ్లి సంబంధాలు చూడాలని మా నానమ్మా ముచ్చట పడుతుందటా. ఆమె కళ్ల ముందు నా పెళ్లి వేడుకలు చూడాలనుందటా. మన దేశానికి రమ్మంటున్నారాంటీ" నా పరిస్థితి చెప్పిన. "అది సహజం బాబూ! పిల్లల పెళ్లి వేడుకలు కళ్లారా చూడాలని ఏ తల్లిదండ్రైనా ఆశిస్తారు" అంది ఆప్యాయంగా. అమ్మానాన్నల ఆదేశానుసారం సొంత దేశానికెళ్లాలని నిర్ణయమైంది. రెండు నెలల సెలవు మంజూరైంది. ఆ సంగతి వాళ్ల అమ్మానాన్నలకు చెప్పగానే "శుభం. ఒంటరిగా పోయి జంటగా తిరిగి రా నాయనా!" ఆశీర్వదించిండ్రు. ఆశీర్వదిస్తూ, "మా మంజీరగ్గూడా మంచి సంబంధం చూడమని మా తమ్మునికి చెప్పిన" అని చెప్పి మురిసిపోయిండు రంగారావు.

వచ్చే ముందొక రోజుముందు తన గదిలో కొస్తుంటే కాలి మువ్వలసవ్వడి గిలిగింతలు పెట్టింది. చింతమడక కెళ్లి వాళ్ల బంధువుల కిమ్మని ఓ పాకెట్ అందించింది మంజీర. నా

కెదురుగా కూచుంది. "మీరు ఇండియా అబ్బాయినే చేసుకుందా మనుకుంటున్నారు గదా...!" కూపీ లాగాలని అడిగిన. "అవును... అదింతకు ముందే మీకు తెలుసుకదా..!" "మీ కెలాంటి భర్త కావాలో మీ బాబాయి చిన్నమ్మలకు తెలుసా?" ఆమె కళ్లలోకి సూటిగా చూసిన. "ఆ విషయం ఫోన్‌లో చెప్పిన. ఉత్తరం గూడా రాసిన." సిగ్గులు సంతరించుకున్న బుగ్గలు గులాబీ రేకులై పోయినై....

చింతమడకల బస్సు దిగంగనే మనోల్లాసం పొంగుకొచ్చింది. బస్టాండు పక్కన దంగుచింత చెట్టు కొమ్మలు-రెమ్మలు ఖుషీగా ఊపుకుంట "ఓ అమెరికా పిల్లగా! నేనున్నది ఎత్తుమీది తోట పక్కనేనని నీకు తెల్వుగదా! మీ నాన్న దోస్తులతోని నా నీడలనే చిర్రగోనె, కబడ్డీ, ఆడుకున్నదు" గుర్తుచేసినట్టనిపించింది. అక్షరాభ్యాసం నుండి రెండు మూడేండ్లు నేనక్కడనే చదివిన సంగతి గుర్తుకొచ్చింది. ముందుకు పోతున్నాను. కె.సి.ఆర్ వాళ్ల బంగళా మా నాన్న అనుభవాలను గుర్తుచేసింది. హన్మాండ్ల గుడి, రావిచెట్టు కింద కచేరి గద్దె, ఈశ్వరాలయం దాటి జోగారావింటికెళ్లి నన్ను నేను పరిచయం జేసుకున్న. వాళ్లంతా నన్ను చిన్నప్పుడు చూసింద్రు.

మంజీర వాళ్ల నానమ్మ బోసి నవ్వుతో "ఓహో, నువ్వేనారా వేణుగోపాలా!" కళ్లజోడు సవరించుకుంట చేతులు తిప్పి మెటికలు విరుచుకుంది. జోగారావు వాళ్లన్నయ్య రంగారావు యోగక్షేమాలడిగి తెలుసుకున్నాడు. పాకెట్ అప్పగించి తిరిగి వెళ్తానంటే విచిత్రంగా చూసింద్రు. రెండ్రోజులుండు మన్నరు. "అట్లా కుదరదు గానీ, ఈ పూట భోంచేసి పోతా" నన్న. గడ్డ పెరుగు భోజనం తృప్తిగా వుంది. ఆ రుచులు అసామాన్యం. జోగారావు కూతురు సిద్దిపేటల డిగ్రీ చదువుతున్న అలకానంద "మిమ్ముల్ని అట్లా పోనిస్తే మా మంజీరక్క ఏమనుకుంటుందో తెల్సా? నా చెవులు ఊడబీకి చేతికిస్తుంది. ఈ రోజు వెళ్లడానికి వీల్లేదు" రాణి రుద్రమలా ఫోజిచ్చి గడప కడ్డంగా నిల్చుంది. "నువ్వాగవే గడబడ్ పిల్లా. మేం మాత్రం అతన్నిప్పుడే పోనిస్తమా?" జోగారావు సముదాయించి కూచోబెట్టిండు. కాదని దులపరించుకుని పోతే, ఫోన్‌ల ఆ సంగతి మంజీరకు తెలిస్తే ఏమనుకుంటుందో? మంజీరక్కాబోయే భర్త ఎవరో కాని అదృష్టవంతుడే. పెళ్లంటే రెండు నిండు మనసుల కలయిక. అది వన్‌వే ట్రాఫిక్ మనసుతో సాధ్యం కాదు.

నా చిన్నప్పటి మిత్రులతో కలిసి మాట్లాడిన బతుకమ్మ పండుగ సంబురాలు, చెరువు కట్టమీద చెడుగుడాట, ఎత్తుమీది తోట్ల దాగుడు మూతలు గుర్తు చేసుకుని నవ్వుకున్నం.

రాత్రికి ప్రత్యేక విందుభోజనం. అలకానంద కొసరి కొసరి వడ్డించింది. ఆమె నవ్వుల గలగలలల్ల మంజీర నవ్వుల సవ్వడి వినపడింది. కాకపోతే, మంజీర నవ్వు నయాగరా జలపాతంలా, అలకానందది త్రివేణి సంగమం లెక్కుంది. మర్నాడు మధ్యాహ్నాం దాకా కులాసాగ గడచింది. అలకానంద వ్యవహారం ఆశ్చర్యాన్నిచ్చింది. మధ్యాహ్నాం బువ్వ దిని కూచున్నాం. "ఇంగ నేను వెళ్లాలె" అనుకుంట మంజీర నానమ్మ పాదాలకు మొక్కిన. ఆ పెద్ద మనిషి తృప్తిగా నవ్వుతూ "కొద్దిసేపు కూచుని వెళ్లు నాయనా" అంది. జోగారావు దంపతులు నాకు బొట్టుపెట్టి కొత్త బట్టలు పెట్టింద్రు. "గీ మర్యాదలు నా కెందుకూ?" తిరిగి ఇవ్వబోయిన. అలకానంద కనుబొమ్మలు పైకి లేచినై. "అవును బావా! మా మంజీరక్కకు కాబోయే బెటరాఫ్వు గదా! ఈ ఇంటి అల్లుడివే గదా!" అనుకుంట వాళ్ళకు రాసిన ఉత్తరాన్ని నా చేతికిచ్చింది. "అది పాకెట్ల పంపింది నాయనా!" ముసలమ్మ ఆసక్తిగా చూసింది. ఉత్తరం విప్పిన. "బాబాయ్-చిన్నమ్మ, నానమ్మలకు నమస్కారాలు. అలకానందకు ముద్దులు. మనూరి వేణుగోపాల్ మనింటి కొస్తున్నడు. ఆయనో పెద్ద సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. ఆయనంటే నాకు పంచప్రాణాలు. అతని గుండె గూటిల నేనున్నానని నాకు తెలుసు. ఇంటల్లుడినెట్లా గౌరవించాలెనో మీకు బాగ తెలుసుగదా! ఈ లెటరు అతన్తో చదివించండి. మీ ముద్దుల పెద్ద కూతురు - మంజీర". గుండె కనుమల్లోంచి కట్టలు తెంచుకుని వస్తున్న ఆశ్చర్యనందాల నెట్లా ఆపుకోవాలెనో అర్థం కాలేదు.

(బతుకమ్మ *4-12-2011*)